ప్రజాశక్తి
శనివారం 11 మార్చి 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2007 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రపంచం మొత్తం మన వైపు చూసే విధంగా చాలా హుందాగా ప్రశాంతంగా జరిగేవని తెలిపారు. ఇప్పుడు అలా కాకుండా దానికి పూర్తి విరుద్ధంగా గందరగోళం సృష్టిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల నమోదులో వైసిపిప్రభుత్వం అనేక దుర్మార్గాలకు ఒడి గట్టిందన్నారు. ఓ పాఠశాలలో 14 మంది ఉపాధ్యాయులు ఉండగా 76 మందిని ఓటర్లుగా చేర్పించారన్నారు. తిరుపతి నియోజకవర్గంలో చదువు లేని మటన్ వ్యాపారి ఓటరుగా నమోదైనట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు అధికారులను ఒత్తిడి గురి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుకు రూ.5 వేల చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా తీసుకోకపోతే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు బెనిఫిట్స్ రూపంలో రూ. 16 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. మార్చి నాటికి ఎంతో కొంత ఇస్తామని మాయమాటలు చెప్పటం ▶ 2లో

నీటి కోసం రోడ్డెక్కిన జనం

3లో ▶

అన్నీ ప్రైవేటు విద్యాసంస్థల్లోనే..

- ప్రైవేటు అధ్యాపకులకు పంపిణీలు
- పార్టీల వారీగా సమావేశాలు
- ఓట్ల కోసం పాట్లు
- తుది దశకు చేరిన

ఎమ్మెల్సీ ఎన్నికల పర్వం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు కేంద్రాలుగా మారిపోయాయి ప్రైవేటు విద్యా సంస్థలు. అక్కడే ఇపుడు అన్ని రకాల అక్రమ వ్యవహారాలు సాగుతున్నాయి. ప్రభుత్వం ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ గెలిచే అవకాశం లేదని తేలడంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా ప్రైవేటు టీచర్లను కూడా ఓటర్లుగా చేర్చారు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థల నుంచే ఎమ్మెల్సీ ఎన్నికలు కలుషితమయ్యే ప్రక్రియ ప్రారంభమైంది. విద్యాసంస్థల్లో ఇలాంటి అక్రమాలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీలు వ్యూహాత్మకంగా అన్ని రకాల వ్యవహారాలకు తెరలేపాయి. ప్రధానంగా పాలకపక్షం నుంచి పోటీచేస్తున్న అభ్యర్థుల తరుపున పంపిణీలు జరిగిపోయాయి. ప్రైవేటు ఉపాధ్యాయులకు ఓటుకు రూ.5వేలు చొప్పున పంచారు. విద్యాసంస్థల్లో ఓటర్ల జాబితాలను తీసుకుని యజమానులను దగ్గరపెట్టుకుని పంపిణీలు చేశారు. కొందరు ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు ఈ పనిచేపట్టారు. పాలకపక్ష నేతలకు తొత్తులుగా మారిపోయారు. విద్యాసంస్థలు నుంచే ఎన్నికలను అపహాస్యం చేసే పనులు మొదలయ్యాయి. ఇవన్నీ బహిరంగంగానే చర్చ సాగుతున్నాయి. దీని ప్రభావం విద్యార్థులపైనా పడుతోంది. డబ్బులు తీసుకుని ఓటేస్తున్నారనే చర్చ ఉపాధ్యాయులపై సాగుతోంది. రేపు విద్యార్థుల ముందు దోషులుగానే మిగిలి పోకతప్పదు. ప్రైవేటు ఉపాధ్యాయులందరికీ పాలకపక్షం నుంచి పోటీచేసిన ఉపాధ్యాయ అభ్యర్థి తరుపున డబ్బులు పంపిణీ చేశారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థికోసం పంపిణీ చేయాలంటే కోట్లలో కావాల్సినందున మౌనంగా ఉన్నారు. టిడిపి అభ్యర్థి అంత ఇవ్వకపోయినా అందులో సగం ఇచ్చేందుకు ప్రయత్నాల్లో ఉన్నట్లు చెబుతున్నారు. ఏదేమైనా రాజకీయ పార్టీల తరుపున పోటీచేస్తున్న అభ్యర్థులు ఇపుడు డబ్బులుపైనే ఆధారపడ్డారు. డబ్బులతోనే గెలవాలనే ఆలోచనకు వచ్చారు. ఇలాంటి అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.అధికారులకు తెలిసినా పట్టించుకునే పరిస్థితి లేదు. గుట్టుగా పంపకాలు సాగుతున్నాయి. ఇక రాజకీయ పార్టీల నుంచి ప్రచారం కూడా తీవ్రతరం చేశారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో రాజకీయంగానూ విభజన రేఖ తెచ్చారు. మండలికి మేధావులను ఎన్నుకునే ఎన్నికలనే ప్రచారం లేకుండా చేశారు. రెండు పార్టీల మధ్య ప్రతిష్టాత్మకం అనే చర్చను తెచ్చారు. ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజల కోసం పిడిఎఫ్ అభ్యర్థులు పోటీలోఉన్నారు. వీరిని అడ్డుకునేందుకు పార్టీల నుంచి అన్ని వ్యవహారాలు సాగుతున్నాయి. ఎన్ని చేసినా పిడిఎఫ్ అభ్యర్థులకు ఆదరణ ఉంది. మూడు పర్యాయాలుగా ప్రజాగొంతుకగా ఉన్న వీరికే ఓటర్లు పట్టం కట్టారు. ఇప్పుడు ప్రలోభాలు ఎంత మేరకు పనిచేస్తాయన్నదే చర్చగా మారింది. మరోవైపు పిడిఎఫ్ అభ్యర్థులకు రెండో ఓటు వేయాలని టిడిపి నిర్ణయించింది. ఈమేరకు పరస్పర అవగాహనకు వచ్చారు. రెండో ఓటును పిడిఎఫ్ అభ్యర్థులకు వేయాలని టిడిపి నేతలు ప్రచారంలో తమ పార్టీ శ్రేణులను కోరుతున్నారు. వైసిపిని ఓడించాలనే రెండో ఓటు పిడిఎఫ్‌కు అనివార్యమని ఆపార్టీ నేతలు స్పష్టంగాచెబుతున్నారు. అన్ని విద్యాసంస్థల్లో అధ్యాపకులను సమావేశపర్చి ఓట్లు అడుగు తున్నారు. ఒంగోలు ▶ 2లో

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి: ఎస్‌పి

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డిని శాసన మండలికి పంపాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు స్వరూపారెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి రవీంద్రారెడ్డి, సిఐటియు నాయకుడు టి. ఆవులయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి: విఠపు

పెద్దదోర్నాల: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం తెలిపారు. స్థానిక టిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ పట్టభద్రుల నియోజక వర్గ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ నియోజక వర్గ అభ్యర్థి బాబురెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా విక్రయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఒప్పంద కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని పిడిఎఫ్ పెద్ద ఎత్తున ఉద్యమిస్తూ ప్రజలకు అండ దండగా వుందని గుర్తు చేశారు. పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా సిపిఐ, ఎఐటియుసి, సిఐటియు, వివిధ ప్రజా సంఘాలు, మేధావులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించడం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం. రఫి, జన విజ్ఞాన వేదిక నాయకులు ఏనుగుల రవి కుమార్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అన్నీ ప్రైవేటు విద్యాసంస్థల్లోనే...

(మొదటి పేజీ తరువాయి)

పట్టణంలో పార్టీల నేతలు ఈ భేటీలు వాడివేడిగా నిర్వహిస్తున్నారు. పార్టీల పరంగా ఉన్న విద్యా సంస్థలు యజమానులు వారి పార్టీ ముఖ్యనేతలను పిలిచి సమావేశాలు పెడుతున్నారు. ఓట్లు కోసం నానాపాట్లు పడాల్సి వస్తోంది. డబ్బు కొందరు బలవంతం గానే తీసుకుంటున్నారు. కొందరు తిరస్కరిస్తున్నారు. వత్తిళ్లకు లొంగి కొందరు తీసుకుంటున్నారు. ఇక ప్రచారం కూడా తుదిదశకు చేరింది. 13న పోలింగ్ జరగనుంది. శనివారంతో ప్రచార పర్వం కూడా ముగియనుంది. ఎమ్మెల్సీల సమరం తుదిదశకు చేరింది.

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సైబర్ నేరాలలో విచారణ వేగవంతంగా పూర్తి చేస్తేనే బాధితులకు న్యాయం చేయగలమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం బాపట్ల జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌ఐలు, సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, డిఎస్పీలతో 2022 నుంచి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి జిల్లా ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేస్ ఫైల్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ సదరు కేసులలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేసిన విధానాన్ని, ఆ కేసులు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను తెలుసుకొని, సదరు కేసులను వేగవంతంగా దర్యాప్తు చేయడానికి తీసుకోవలసిన చర్యలను గురించి మెళకువలను దర్యాప్తు అధికారులకు సూచించారు. అనంతరం ఎస్పీ పోలీస్ అధికారులతో మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న కేసులలో వృత్తి నైపుణ్యంతో పాటు సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని దర్యాప్తు సాగించి, ముద్దాయిలను అరెస్ట్ చేసి వీలైనంత త్వరగా ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే నేరస్తుని

బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్

అకౌంట్‌లోని సొమ్ము ఇతర అకౌంట్‌లలోకి బదిలీ కాకుండా నిలుపుదల చేసి, బ్యాంక్ అధికారుల నుంచి సదరు అకౌంట్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవాలని అన్నారు. సైబర్ నేరాలలో విచారణ వేగవంతం పూర్తి చేస్తేనే బాధితులకు త్వరగా న్యాయం చేయగలమన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ విక్రయించే వారు ప్రధానంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకొని వారి కార్యకలాపాలను సాగిస్తుంటారని, అదేవిధంగా క్వారీలలో, ఫ్యాక్టరీలలో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికులను కూడా లక్ష్యంగా చేసుకొని వారికి గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించే అవకాశం వుంటుందని అన్నారు. కనుక పోలీస్ అధికారులు అనుమానిత ప్రాంతాలలో తరచూ సోదాలు నిర్వహించాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కళాశాలలో, పాఠశాలలో 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కలిగే విధంగా పోస్టర్స్ ఏర్పాటు చేసి, డ్రగ్స్ వినియోగించడం వల్ల కలిగే అనర్థాలు గురించిన చిత్రాలను ప్రదర్శించి విద్యార్థులలో చైతన్యం తీసుకు రావాలని అన్నారు. అప్పుడే మనం జిల్లాలో పూర్తి స్థాయిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాల అక్రమ రవాణాను అరికట్టేందుకు అవకాశం వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి మహేష్, బాపట్ల, చీరాల, రేపల్లె డిఎస్‌పిలు ఏ శ్రీనివాసరావు, పి శ్రీకాంత్, టి మురళీకృష్ణ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ పి బాలమురళీకృష్ణ, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, బాపట్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ పి కృష్ణయ్య, బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీ వేణుగోపాల రెడ్డి, మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ టి ఫిరోజ్, చీరాల 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ వి మల్లికార్జునరావు, చీరాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ మల్లికార్జునరావు, అద్దంకి టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య, రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ విజయచంద్ర, రేపల్లె రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ శివశంకర్, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి..

రైతు గ్రూపులకు ట్రాక్టర్లు పంపిణీ

ప్రజాశక్తి-ముండ్లమూరు

ఈ నెల 13న చిత్తూరు,నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ నియోజక వర్గ ఎమ్మెల్సీల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మూడు జిల్లాల్లో 16 వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అందువల్ల ప్రభుత్వ పథకాలు పంపిణీ చేయడం, ప్రారంభోత్సవాలు, శకుస్థాపనలు చేయకూడదని ఎన్నికల నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ స్థానిక ఎఒ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ముండ్లమూరుకు చెందిన అంబటి వెంకటేశ్వరెడ్డి రైతు గ్రూపు, నాయుడుపాలెం గ్రామానికి చెందిన పందిరి సుబ్బారెడ్డి రైతుల గ్రూపునకు 50శాతం రాయితీతో ఒక్కొక గ్రూపునకు రూ.15 లక్షల విలువైన టాక్టర్, ట్రక్కు, రోటావేటర్, నాగలి, గొర్రు, మందుస్ప్రే పంపు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఎఎ శోభారాణి, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు గ్రూపులకు ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారి

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో

కూలీలు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-మద్దిపాడు

ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలని ఏపీవో పి వాక్యావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్లంపల్లిలో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. వేసవి కాలం నేపథ్యంలో కూలీలకు అవసరమైన మజ్జిగ, గుడారాలు ఏర్పాటు చేయాలని ఎఫ్ఐకి సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ కొలతల మేరకు పనులు చేయాలని పేర్కొన్నారు.

ఒంగోలు ఫ్యామిలీ జడ్జి (8 వ అదనపు జిల్లా జడ్జి)
వారి కోర్టులో
OS No:171/2015
మన్నం వెంకటశేషయ్య .....వాది
వర్సెస్
శ్రీశ్రీశ్రీ నారాయణస్వామి రా & బాయిల్డ్ రైస్ మిల్లు రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజింగ్ పార్టనర్ ముసులూరి సత్యనారాయణ వగైరా .....ప్రతివాదులు
నోటీసు
ముసులూరి రాధ భర్త సురేష్‌బాబు D. No:1-108, తిమ్మనపాలెంగ్రామం , కొరిశపాడు మండలం బాపట్లజిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
వాది పై దావాను ప్రతివాదుల నుండి తనకు రావలసిన బాకీ వసూలుకై దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు నోటీసు పంపిన నూ మీరు తీసుకొనందున ఈ నోటీసు ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా తేదీ 20-03-2023 న ఉదయం 10:30 కి శ్రీ కోర్టు వారి ఎదుట మీరు గాని మీ అడ్వకేట్ గాని హాజరై మి ఆక్షేపణలు తెలియజేసుకోనవలెను లేనియెడల మి పరోక్షమున దావా తీర్మానం చేయబడునని తెలియ జేయడమైనది
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
ఇట్లు
పత్తిపాటి రామమూర్తి
వాది తరపు అడ్వకేట్
ఒంగోలు

వేలం నోటీసు
In the court of the Principal Senior Civil Judge at: Bapatla.
EP. No. 69/2016
in
O.S.No.286 /2012.
Between:
Kanneganti Appa Rao, ...DHr.
Versus
1. Shaik Nurjahan
2. Shaik Tahera
3. Shaik Nurjahan ......J.Drs.
పై నెంబరు అమలులో J.Drs. తాలూకు ఈ క్రింద తెలిపిన E.P. షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని ది. 04-04-2023 తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10 గంటల 30 నిమిషములకు బహిరంగవేలము. జరుగునని తెలియపరచట మైనది. కావున వేలం పాటలో పాల్గొనువారు వేలం పాటలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు
Narasaraopet Registration District - Pedanandipadu Mandal, Pedanandipadu Village, N.T.R. Colony - D. No. 10-142A, house site to an extent of Ac 0.02 cents with terraced house Bounded by:
East : LankeRanganayakulu.
South : Suvarnaganti Nageswara Rao.
West : Panchayat Road.
North : Shaik Gouse Peer.
DHR Value : Rs.4,00,000/-
Amin Value Rs.6,00,000/-
వేలం వాయిదా: 04-04-2023.
పరథర్ హియరింగ్ 11-04-2023
ఇట్లు
D.Hr. తరపు అడ్వకేటు,
P. Raghuram, Advocate,
Vijayalakshmipuram, Bapatla.
Cell No. 9849744524.

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం
జె.పుల్లలచెరువు గ్రామము, రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా .
సీల్డ్ టెండర్ ప్రకటన

ప్రకాశంజిల్లా, రాచర్ల మండలం, జె.పుల్లలచెరువు గ్రామ సమీపంలో వేంచేసియున్న శ్రీ నెమిలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం నందు తేదీ 6-4-2023 నుండి 8-4-2023 వరకు జరుగు స్వామి వారి బ్రహ్మోత్సవములలో క్రింద తెలిపిన వివరముల ప్రకారము సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. తేదీ 20-3-2023 సోమవారం ఉదయము 11 గంటలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో దేవస్థానం కార్యాలయము నందు టేండర్లు స్వీకరించి,అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు తెరువబడును. టెండర్ల లో పాల్గొనువారు ప్రథమ ధరావత్తు చెల్లించి ఆయా ఐటమ్ చూపబడిన టెండర్ ఫారములు/ కొటేషన్ నింపి సీల్డ్ కవర్లో ఉంచి ఏ టెండర్ వేయిచున్నారో కవర్ పై టెండర్ పేరు రాసి బాక్స్ లో వేయవలయును.

వ.నెం	టెండర్ వివరములు	కాల పరిమితి	ధరావత్తు
1	షామియానాలు ,గుడ్డ పందిర్లు స్టేజి బల్లలు, కుర్చీలు ఏర్పాటు చేయుట	06-04-2023 నుండి 08-04-2023	రూ.10,000/-
2 .	ఎలక్ట్రికల్ డెకరేషన్ ఏర్పాటు చేయుట	06-04-2023 నుండి 08-04-2023	రూ.10,000/-
3	ట్రాక్టర్ తో మట్టి తోలుట,డోజర్‌తో లెవెలింగ్ చేయుట, జెసిబి తో చిల్ల చెట్లు తొలగించుట.	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
4	బ్రహ్మోత్సవములలో యాజ్ఞీకం. అలంకారం చేయుట, వంటలు చేయుట	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
5	పూలు ,పూలదండలు సప్లై చేయుట .	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
6	మినిరల్ వాటర్ సప్లై చేయుట. (వాహనముతో కలిపి)	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
7	వాడుక వాటర్ పైప్ లైన్ల మెటీరియల్ కొనుగోలు, ఏర్పాటు ,లేబర్ చార్జీలతో కలిపి .	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
8	ఫ్రీ సర్వీస్ ఆటోలు ఏర్పాటు చేయుట .	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
9	ఉచిత ప్రసాదం మరియు తయారీ.		
10	తెప్పోత్సవమునకు తెప్ప తయారీ	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
11	వివిధ ఐటములకు సున్నం వేయుట లేబర్ చార్జీలతో కలిపి.	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
12	ఎస్.ఎమ్.ఆర్ అండ్ శానిటేషన్ సిబ్బంది ఏర్పాటు చేయుట	06-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-
13	ఫ్లెక్సీలు ఏర్పాటు చేయుట.	6-04-2023 నుండి 08-04-2023	రూ.2,000/-

షరతులు : ఇతర వివరముల కొరకు, షరతుల కొరకు కార్యాలయము పనివేళలయందు అడిగి తెలుసుకొనవచ్చును. ఒక్కొక్క ఐటమునకు ఒక టెండర్ ఫారం మాత్రమే వేయవలయును .

తేది:05-03-2023 — కన్నసాని చిన్నఓబులేసు, చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి — ఈదుల చెన్నకేశవరెడ్డి, కార్యనిర్వహణాధికారి.
స్థలం : జె.పుల్లలచెరువు

మూఢనమ్మకాలతో మూడు హత్యలు

ఎట్టకేలకు నిందితుడు కటకటాలపాలు

ప్రజాశక్తి-గిద్దలూరు

మూడు హత్యలు చేసి ఏడు నెలలుగా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడు ఎట్టకేలకు శుక్రవారం పోలీసులకు లొంగిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గత సంవత్సరం జూలై 22వ తేదీన కుక్క మల్లికార్జున అనే వ్యక్తి తన సొంత బాబాయ్ కుటుంబాన్ని రాళ్లతో దాడి చేసి హతమార్చాడు. తర్వాత నిందితుడు సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు. నిందితుడు ఏడు నెలలుగా పోలీసులకు చిక్కకుండా ఇతర రాష్ట్రాలలో తిరిగాడు. జిల్లా ఎస్పీ మల్లికాగర్గ్ ఆదేశాలతో పలు టీమ్‌లను ఏర్పాటు చేసిన స్థానిక పోలీసులు నిందితుడు కోసం గాలించిన ఫలితం కనిపించలేదు. పోలీసులు తన కోసం గాలిస్తున్నారని తెలుసుకున్న నిందితుడు భయంతో పోలీసులకు శుక్రవారం లొంగిపోయాడు. సీఐ ఫిరోజ్ మీడియాకు తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు కుక్క

నిందితుడు మల్లికార్జున

మల్లికార్జునకు జాతకాల పిచ్చి ఉందని, 30 సంవత్సరాలు దగ్గర పడుతున్నా ఇంకా తనకు పెళ్లి కాకపోవడం, ఆర్థికంగా ఎదగలేకపోవటం అంశాలపై దారిన పోతున్న స్వాములను, సాధువులను కలిసి తన పరిస్థితి గురించి మల్లికార్జున అడగడంతో వారు 'మీ ఇంటి పక్క వారే మీకు హాని చేస్తున్నారని, చేతబడి చేస్తున్నారు' అని ఆ సాధువులు చెప్పారు. దీంతో వారు చెప్పిన మాటలు నమ్మిన కుక్క మల్లికార్జున తన ఇంటి పక్కన బాబాయి కుటుంబం జీవిస్తూ ఉండటం గత కొద్దిగా కాలంగా వారికి మనస్పర్ధలు ఉండటం వలన వారు ఇదే విధంగా విధంగా చేస్తుంటారని భావించి వారిపై రాళ్లతో దాడి చేసి హతమార్చాడు. ఈ రాళ్లదాడి జరిగిన క్రమంలో సంఘటనా స్థలంలోనే పిన్ని ఈశ్వరమ్మ మృతిచెందగా తీవ్రంగా గాయపడ్డ బాబాయ్ తిరుమలయ్య, చెల్లెలు స్వప్న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని వెల్లడించారు. చెల్లెలు స్వప్న నిండు గర్భిణి అనే జాలి కూడా లేకుండా మల్లికార్జున క్రూరంగా వ్యవహరిస్తూ రాళ్లు, ఐరన్ రాడ్‌తో దాడి చేశాడని విచారణలో వెల్లడించదని సీఐ ఫిరోజ్ తెలిపారు. నిందితుడు తిమ్మాపురం వీఆర్వో వద్దకు వచ్చి లొంగిపోగా వీఆర్వో ఇచ్చిన సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని సీఐ ఫిరోజ్ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులోని ప్రభుత్వ మహిళా బ్యాంకు

భవనం ప్రభుత్వానిది.. వ్యాపారం ప్రైవేటుది

ఉప్పుగుండూరు మహిళా బ్యాంకులో హెర్బల్ ప్రొడక్ట్స్ వ్యాపారం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరు ప్రభుత్వ మహిళా బ్యాంకును ప్రయివేట్ వ్యాపారులకు అద్దెకు ఇచ్చిన సంఘటన చేసుకుంది. అందిన వివరాల మేరకు. డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసేందుకు డిఆర్‌డిఏ ద్వారా కొంత నిధులను కేటాయించి తద్వారా గ్రూపులకు రుణాలు అందచేసి ఆర్థికంగా ఎదిగేందుకు ఆ బ్యాంకును ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బ్యాంకు లావాదేవీలు నిర్వహించుకుంటూ ఇచ్చిన రుణాలు వసూలు చేసి తిరిగి కొత్త గ్రూపులకు రుణం మంజూరు చేస్తూ బ్యాంకు అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ కార్యకలాపాలన్నీ ప్రభుత్వ పరంగానే సాగుతాయి. గ్రూపులకు సంబంధించి సమావేశాలు బ్యాంకులోనే నిర్వహిస్తారు. ప్రస్తుతం మహిళా బ్యాంకులో లావాదేవీలు నిలిచిపోయాయి. లావాదేవీలన్నీ వివోఏల ద్వారా జరుగుతున్నాయి. దాన్ని ఆసరా చేసుకొని ప్రభుత్వరంగ సంస్థ భవనాన్ని కొంతమంది వ్యక్తులు ప్రయివేటు వ్యాపారస్తులైన హెర్బల్ ప్రొడక్ట్స్‌కు నెలకు కొంతమొత్తం నగదు తీసుకొని అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా హెర్బల్ ప్రొడక్ట్స్ వారు మహిళా బ్యాంకులో నిత్యం వ్యాపారం చేస్తూ లక్షలు గడిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ రంగ సంస్థను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం: డిఆర్‌డిఏ పీడీ బాబూరావు

దీనిపై డిఆర్‌డిఏ పీడీ బాబూరావును వివరణ కోరగా మహిళా బ్యాంకు భవనం తమ సంస్థకు సంబంధించినదేనని పేర్కొన్నారు. దీనిని ప్రయివేట్ వ్యక్తులకు అద్దెకు ఇవ్వడానికి వీలులేదన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, తగు చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

గుండెపోటుకు మరో యువకుడు బలి

ప్రజాశక్తి-పంగులూరు: పంగులూరులో గుండెపోటుతో మరో యువకుడు కూచిపూడి ప్రభుదాస్(32) శుక్రవారం ఉదయం మరణించాడు. పంగులూరు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఈ వారంలోనే గుండెపోటుతో మరణించడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత శనివారం పంగులూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాలపర్తి వెర్రిబాబు వేటపాలెం మండలం, వాకా వారిపాలెంలో విద్యార్థులకు పాఠాలు చెబుతూ తరగతి గదిలోనే గుండెపోటుతో మరణించాడు. పంగులూరు గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేసే గుంతోటి ఆదినారాయణ పారిశుధ్య పనులు చేస్తూనే గుండెపోటుకు గురయ్యాడు. ఆసుపత్రికి చేర్చేలోపే మరణించాడు. తాజాగా కూచిపూడి ప్రభుదాసు ఉదయం టిఫిన్ చేసి, ఇంటికి వచ్చేలోపే గుండెపోటు వచ్చింది. మేదరమెట్లలోని హాస్పిటల్లోకి తీసుకెళ్లేలోపే తుదిశ్వాస విడిచాడు. ప్రభుదాసు గత మూడు సంవత్సరాల నుంచి హైదరాబాదులో బేల్దారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితమే పంగులూరు వచ్చాడు.

ట్రాన్స్‌పోర్టు వాహనం ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-మార్కాపురం: ఎస్ఆర్ఎంటి ట్రాన్స్‌పోర్టు వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న పింజరి మౌలాలి(45)ని శివశక్తి ట్రాన్స్‌పోర్ట్ వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలో శుక్రవారం జరిగింది. మృతుడు మౌలాలి కర్నూలు జిల్లా కల్లూరు మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. వాహనాలు రివర్స్ చేసే క్రమంలో మౌలాలి రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోవడంతో చనిపోయినట్లు భావిస్తున్నారు. మార్కాపురం పట్టణ మహిళా ఎస్ఐ సువర్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ పరిధిలోని చెరువుకట్ట వద్ద ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని గోగులదిన్నె గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి మృతి చెందాడు. ఈ మృతి అనుమానంగా ఉందని బంధువులు ఆరోపిస్తున్నారు. మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఇది ప్రమాదం కాదని, కావాల్సి చేసిందేనని బంధువులు వాదిస్తున్నారు.

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

రాష్ట్ర సరిహద్దుల నుంచి గంజాయిని ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు ఒంగోలు డిఎస్‌పి యు నాగరాజు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.17 లక్షల విలువైన 110 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. డిఎస్‌పి తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దులో గంజాయిని పండించి అతని అనుచరుల ద్వారా వాటిని ప్యాకింగ్ చేయించి తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న ముఠాను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ ముఠా పాలవ్యానులాగా వాహనంలో కింద గంజాయిని పెట్టుకుని వెళుతున్న వాహనాన్ని టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద సింగరాయకొండ సిఐ రంగనాథ్ ఆధ్వర్యంలో టంగుటూరు సిఐ వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా విశాఖపట్నం జిల్లా నర్శీపట్నానికి చెందిన వ్యక్తి గంజాయి పండించి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్న విషయంపై తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. వీరు కొండెపి గ్రామానికి సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడయిందని తెలిపారు. దీనితో వారిని కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు.

నిందితులు వీరే.. 1.విశాఖపట్నం జిల్లాకు చెందిన కూండ్రపునాయుడు, 2. తమిళనాడు, దిండిగల్‌కు చెందిన పి దినకర్, 3. కేరళ రాష్ట్రం, పలక్కడ్ జిల్లాకు చెందిన సులైమాన్ సికిందర్, వినీత్ సిడి, తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌కు చెందిన ఉత్తుమాన్ అలీ, ఉత్తుమాన్ అలీ, రియాజ్, అనకాపల్లి జిల్లాకు చెందిన చలమశెట్టి జగదీష్, కొండేపి మండలం, అనకర్లపూడికి చెందిన ముప్పరాజు వెంకన్నను అరెస్టు చేసినట్లు తెలిపారు.

అదే గ్రామానికి చెందిన వెంకాయమ్మ, నాగమణి, సుభానిలను అరెస్టు చేయాల్సిఉందని తెలిపారు. ప్రతిభ చూపిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. సింగరాయకొండ సిఐ డి రంగనాథ్, టంగుటూరు ఎస్ఐ ఎస్‌కె ఖాదర్‌బాషా, ఎఎస్ఐ ఎస్‌కె మహబూబ్ బాషా, హెచ్‌సిలు భాస్కర్ లింగం, ఎం శ్రీమన్నారాయణ, ఎస్‌కె చాంద్‌బాషా, పిసిలు జి శ్రీనివాసులు, ఎస్ మహేష్, డి శ్రీనివాసులు, టి వేణుబాబు, హెూంగార్డు ఎం ఉపేంద్రలను అభినందించారు.

వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు విస్తతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అన్ని ప్రధాన రహదారులలో అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఈవోపీ ఆర్‌డి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాలలో అక్రమ మద్యం, డబ్బు తరలిస్తే అలాంటి వారిపై చట్టమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేసినా, ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేసినా వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ తనిఖీలలో ఏఎస్ఐ బాలకృష్ణ ఉన్నారు.

లారీని ఢీకొన్న కారు

వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరు సమీపంలోని కోనంకి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా మడనూరు మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన ఎం సంజీవరెడ్డి వ్యక్తిగత పనుల మీద మరో ఇద్దరితో గుంటూరు వచ్చారు. అనంతరం తమ స్వగ్రామం నెల్లూరు వెళ్తున్నారు. వీరి వాహనం కోనంకి సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా నెమ్మదించడంతో కారు అదుపు చేయలేక బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు ముందు సీట్లో కూర్చొని ఉన్న సంజీవరెడ్డి తలకు బలమైన గాయం తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కారులోని మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది తీవ్రంగా గాయపడిన సంజీవరెడ్డిని ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు.

సర్పంచి చెక్ పవర్ పునరుద్ధరణ

ప్రజాశక్తి-పర్చూరు: హైకోర్టు ఆదేశాల మేరకు పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం సర్పంచ్ నిడమానూరి ఖాజాబీ చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్వర్వులు జారీ చేశారు. సర్పంచ్ ఇచ్చిన వివరణను పరిశీలించిన డిపిఒ తిరిగి చెక్ పవర్‌ను పునరుద్ధరించినట్లు సర్పంచ్ ఖాజాబీ ప్రజాశక్తికి తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పొదిలి: పొదిలిలోని ఓ బ్యాంక్‌లో ముప్పై వేల నగదు చోరీ, విద్యుత్ తీగల దొంగతనం, ద్విచక్ర వాహన అపహరణ తదితర కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి నిందితులకు మూడు నెలల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చీటిపాటలతో మోసం చేసిన వ్యక్తికి జైలుశిక్ష

ప్రజాశక్తి-దరిశి

దరిశి నగర పంచాయతీకి చెందిన వ్యక్తి చీటిపాటలు వేస్తూ కొంతమంది వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు సితారి చిన్నమంతయ్యకు రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ దరిశి ఫస్ట్‌క్లాసు మేజిస్ట్రేట్ జివిఎల్‌వి సరస్వతి తీర్పునిచ్చారు. దరిశికి చెందిన పానుగంటి బాలాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దరిశి పోలీస్ స్టేషన్‌లో 2018లో 420 కింద ఎఎస్ఐ సాయిరెడ్డి కేసు నమోదు దర్యాప్తు చేశారు. కోర్టులో నిందితుడికి నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించారు.

ఉద్యోగులను వేధిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

పని భారంతో పలువురు మృత్యువాత ● ధ్వజమెత్తిన వామపక్ష నేతలు ● పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని వినతి

ప్రజాశక్తి-అద్దంకి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలను పని ఒత్తిడితో అనేక ఇబ్బందులకు గురి చేస్తోందని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్లో వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, సచివాలయ ఉద్యోగులపై కావాలని పని ఒత్తిడి పెంచారన్నారు. పని భారంతో అనేక మంది ఉద్యోగులు మృత్యువాత పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను అటెండెన్స్ జీతాలకు లింకు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఉద్యోగుల బాకీలు ఇవ్వకుండా వారు దాచుకున్న డబ్బులను కూడా ప్రభుత్వం వాడేసుకుంటోందని అన్నారు. జీతాలు పెండింగులో ఉన్నాయన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రావడంతో ఉద్యోగులు దాచుకున్న డబ్బు రూ.3,000 కోట్లు రిలీజ్ చేస్తామని అదే పెద్ద గొప్పగా చెప్పుకుంటూ కంటి తుడుపు చర్యకు పూనుకుందని అన్నారు. ఈ విషయాన్ని సిపిఐ, సిపిఎం పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. పని ఒత్తిడితో వేటపాలెం మండలంలోని ఒక పాఠశాలలో పంగులూరు మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందేనని అన్నారు. ఈ నెల 13న జరిగే పట్టభద్రుల గ్రాడ్యుయేట్ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ఔట్సోర్సింగ్ సచివాలయ ఉద్యోగులకు పని ఒత్తిడి పెంచి అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం వస్తే సిపిఎస్ను రద్దు చేసి ఒపిఎస్ను వెంటనే అమలులోకి తెస్తానని మాట ఇచ్చి దానిని మరిచిన ఘనుడు సిఎం జగన్ అని అన్నారు. మాట తప్పం మడమ తిప్పం అనే నినాదంతో ప్రజలను అనేక రకాలుగామోసం చేసిన వ్యక్తి మన ముఖ్యమంత్రి అన్నారు. సిపిఐ జిల్లా నాయకులు తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే అధికార ప్రభుత్వం ఓటర్లకు డబ్బు ఎరచూపి ప్రలోభాలకు గురిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కెఎల్డి ప్రసాద్, బి విజయ్కుమార్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాపట్ల జిల్లా వామపక్ష నాయకులు

పర్చూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రదర్శన

ప్రజాశక్తి-పర్చూరు

ఉద్యోగుల ఓపిఎస్ రద్దు చేయాలని కోరుతూ పర్చూరు బొమ్మల సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్ మాట్లాడుతూ ఉద్యోగులపై వేధింపులు, కక్షసాధింపు చర్యలు ఆపాలని, పిఆర్సి బకాయిలు వెంటనే ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్న దొంగ ఓట్లను తొలగించాలని కోరారు. అనంతరం పర్చూరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో చిమటా వెంకటేశ్వర్లు, డేవిడ్, ట్రైసన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిఎంహెచ్వో విజయమ్మకు జ్ఞాపిక అందిస్తున్న రోటరీ క్లబ్

మహిళా అధికారులకు రెడ్ క్రాస్ జ్ఞాపికలు

ప్రజాశక్తి-బాపట్ల

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పలువురు మహిళా అధికారులకు శుక్రవారం ప్రత్యేక మెమెంటోలు అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ విజయమ్మ, సబ్ ట్రెజరీ అధికారి ఎన్ అనూరాధ, బాపట్ల మండల తహశీల్దార్ డి కవిత, డిటి కె శ్రీదేవి, వైద్యాధికారులు సౌజన్య, రోహిణి, రత్నశ్రీ, ప్రేమ పావని, ఆశాకిరణ్, డిఎస్ఒ మార్గరెట్, సిహెచ్వో పద్మావతి, ప్రమీల, రాజ్యలక్ష్మి, ఏఎస్ఐ సరోజిని, విఆర్ఒ లక్ష్మీ తిరుపతమ్మ, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అజీదా బేగం, సీతా భవాని, పి వెంకటరమణలకు జ్ఞాపికలు అందజేశారు. పలు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ నారాయణ భట్టు, పరిశుద్ధరావు, ఇపి రావు, నవనీత, గోపీకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏసమ్మ

మహిళాభ్యుదయానికి ఆటంకంగా మారిన మోడీ ప్రభుత్వం

ప్రజాశక్తి-బాపట్ల

కేంద్రంలో మోడీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఆటంకంగా మారిందని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శీలం ఏసమ్మ అన్నారు. శుక్రవారం 113వ అంతర్జాతీయ శ్రామిక మహిళ పోరాట దినోత్సవం సందర్భంగా పిఒడబ్ల్యూ బాపట్ల మండల కార్యవర్గం ఆధ్వర్యంలో బాపట్ల అంబేద్కర్ భవన్లో మహిళా సదస్సు నిర్వహించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వ పాలనలో మహిళలు అభివృద్ధికి నోచుకోవడం లేదని సదస్సులో పాల్గొన్న పలువురు మహిళ నాయకులు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యూ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు జె కల్పన, డి రాములమ్మ, కొండ అన్నమ్మ, పి లక్ష్మి, జి మరియమ్మ, మువ్వల పల్లవి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి

ప్రజాశక్తి- మేదరమెట్ల: ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర ఐద్వా మహిళ ప్రధాన కార్యదర్శి రమాదేవి పిలుపునిచ్చారు. మేదరమెట్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను అడ్డుకుంటోందని, ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల నేపత్యంలో విద్యాశాఖకు సంబంధించిన ప్రవీణ్ ప్రకాష్ వివిధ కారణాలతో పాఠశాలలను పర్యవేక్షిస్తూ వైసిపికి ఓటు వేయమని టీచర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు విమర్శించారు. పిడిఎఫ్ అభ్యర్థులు గెలుస్తారనే భయంతో వైసిపి ప్రభుత్వం ఉపాధ్యాయులపై, గ్రాడ్యుయేట్ ఓటర్లపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. అనంతరం కోరిశపాడు మండలం మండల పరిషత్ ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ మండల పరిధిలోని 18 గ్రామాలలో పిడిఎఫ్ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థులకు పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుడు వీరాంజనేయులు, కెవిపిఎస్ మండల నాయకుడు కంచర్ల సురేష్ బాబు, చావా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారత ఖోఖో జట్టుకు సీఈసీ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-చీరాల

భారత కోకో జట్టుకు చీరాల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎంపిక కావటం తమ కళాశాలకు గర్వకారణమని సిఇసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్సాంలో జరగనున్న ఆసియా కోకో పార్లమెంటులో భారత జట్టుకు పాల్గొనే తమ కళాశాల విద్యార్థి ఆట్ల శివనాగిరెడ్డి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. శివనాగిరెడ్డి తమ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నారని ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే శిక్షణ శిబిరంలో విద్యార్థి పాల్గొంటారని అన్నారు. కోకో టోర్నమెంట్ ఈ నెల 20 నుంచి 23 వరకు జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఇండియా జట్టుకు ఎంపికైన శివనాగిరెడ్డికి కళాశాల పీడీ శ్రీనివాసరావు, యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థి నాగిరెడ్డి

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలి: ఏవో

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

రైతులు చిరుధాన్యాల సాగువైపు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ అధికారి పి పావని కోరారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. చిరుధాన్యాలైన రాగులు సజ్జలు, జొన్నలు, కొర్రలు, అరిగెలు, వరిగెలు, సామలు, ఊదలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల చిరుధాన్యాల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న జేఎల్జి గ్రూప్ సభ్యులు బ్యాంక్ అకౌంట్లను ఓపెన్ చేయాలని ఆమె సూచించారు. సమావేశానికి మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బోయళ్ల నరసింహారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి పావని

'ప్రైవేట్' వైపు.. మొక్కజొన్న రైతుల చూపు

ప్రభుత్వ ధర కన్నా ప్రైవేట్ వ్యాపారుల ధర ఎక్కువగా ఉండటమే కారణం

ప్రజాశక్తి-పంగులూరు

మొక్కజొన్న ఇప్పుడిప్పుడే పండి రైతు ఇంటికి చేరుతోంది. రైతులు మొక్కజొన్నను అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ప్రైవేట్ వ్యాపారులు ధరను పెంచుతూ ఉండటంతో రైతులు కొంత ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. గతంలో మొక్కజొన్నకు ఎప్పుడూ లేనంతగా ఇపుడు డిమాండ్ ఉంది. గతంలో మొక్కజొన్నను వ్యాపారులు అంతగా పట్టించుకునేవారు కాదు. గత సంవత్సరం రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో మొక్కజొన్న దిగుమతులు ఆగిపోవడంతో, ఇక్కడ మొక్కజొన్నకు డిమాండ్ పెరిగింది. దీంతో వ్యాపారులు మొక్కజొన్నకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పంగులూరు మండలంలో 4,700 ఎకరాల్లో ఈ సంవత్సరం రైతులు మొక్కజొన్నను సాగు చేశారు. వాతావరణం అనుకూలించటం వలన ప్రస్తుతం మొక్కజొన్న పంట ఆశాజనకంగానే ఉంది. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రభుత్వం క్వింటా ధర రూ.1,950గా ప్రకటించగా, ప్రైవేటు వ్యాపారాలు మాత్రం నిన్న మొన్నటి వరకు రూ.2,150 ధర చెప్పినవారు ఈరోజు ఏకంగా రూ.2,300 ధర చెబుతున్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వైపు చూస్తున్నారు. కొంతమంది రైతులు ఈపాటికే మొక్కజొన్నను స్థానిక మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి ఆరబెట్టుకుని వ్యాపారుల కోసం ఎదురు చూస్తున్నారు. మరికొందరు ఇంకా రేటు ఎంత పెరుగుతుందోనని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ రేటు కన్నా ప్రైవేట్ రేటు ఎక్కువగా ఉండటంతో ఈ రేటు ఎంత కాలం ఉంటుందో, ఎంత కొంటారో అని రైతులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం కూడా ఈ రేటు ఇవ్వాలని కోరుతున్నారు.

పంగులూరు మార్కెట్ యార్డ్లో మొక్కజొన్నను ఆరబెట్టి, బస్తాలకు ఎత్తుతున్న దృశ్యం

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

- చీమకుర్తిలో బైకుర్యాలీ
- పలుచోట్ల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

చీమకుర్తిలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-చీమకుర్తి

పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పొక్కిరెడ్డిబాబురెడ్డికి మద్దతుగా యుటిఎఫ్, సిఐటియు,ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్ఎస్‌పి కార్యాలయం సెంటర్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ స్టేట్ బ్యాంకు, తహశీల్దారు కార్యాలయం మీదుగా దాచూరిరామిరెడ్డి యుటిఎఫ్ కార్యాలయం వరకూ నిర్వహించారు. ర్యాలీని యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎన్.హరిప్రసాదరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడివెంకటరావు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం,ప్రజా ఉద్యమాల వాణిని శాసనమండలిలో వినిపించే పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.అక్బర్, చలువాది శ్రీనివాసరావు, సిఐటియు మండల అధ్యక్ష,కార్యదర్శులు బి.వీరాంజనేయులు, పల్లాపల్లి ఆంజనేయులు, సిఐటియు నాయకులు పి.వెంకటరావు, కెవిపిఎస్ నాయకులు టి.రామారావు, ప్రజాసంఘాల నాయకులు పి. కోటేశ్వరరావు, ఎన్. వెంకటేశ్వర్లు,పి దేవదాసు,పి.వెంకటేశ్వర్లు, బెజవాడశ్రీను, పి.సురేష్, ఆదినారాయణ,శ్రీను,నాగయ్య పాల్గొన్నారు.

సిసిపల్లి : పిడిఎఫ్, ప్రజాసంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజల సంఘాల నాయకులు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాసన మండలిలో నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజల గురించి ప్రశ్నించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీ లేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఎఐఇఎ (సిఐటియు) కనిగిరి బ్రాంచి నాయకుడు మినిగ మధుసూదనరావు, ఆటో యూనియన్ నాయకుడు సిహెచ్.నవీన్ పాల్గొన్నారు. **దర్శి :** ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ తూర్పు రాయలసీమ నియోజకవర్గాల నుంచి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తే శాసనమండలిలో నిరుద్యోగం, సిపిఎస్ రద్దు, విద్యావిధానం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడతారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, డివైఎఫ్ఐ, జెవివి, రైతు సంఘం నాయకులు కె. పిచ్చయ్య, నాగరాజు, సందు వెంకటేశ్వర్లురావు, ఈమని నాగేశ్వరరావు, ఎస్.కోటిరెడ్డి, జాన్ పాల్గొన్నారు. **పొదిలి :** ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక, పెన్షనర్ల హక్కులను కాల రాసిన వైసిపికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు, ఎఐటియుసి, పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని, మెరుగైన పిఆర్‌సి ఇస్తామని ఐఆర్ కంటే ఫిట్‌మెంట్ తగ్గించటమే కాకహౌస్ రెంట్, అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ తగ్గించినందుకు వైసిపి ఓటు వేయాలా అని ఆయన ప్రశ్నించారు. ఎఐటియుసి మండల కార్యదర్శి కెవి.రత్నం మాట్లాడుతూ విద్యావంతులు పోటీపడే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓట్ల కొనుగోలుకు తెరలేపి వైసిపి ప్రజాస్వామ్య పతిష్టను దిగజార్చుతుందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ పొదిలి తాలుకా యూనిట్ ట్రెజరర్ సుబ్బారావు పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపును ఆకాంక్షిస్తూ ముద్రించి వాల్ పోస్టర్‌ను వివిధ ప్రజా సంఘాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై శాసనమండలిలో గలం వినిపించేది పిడిఎఫ్ అభ్యర్థు లేనన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం , పభుత్వ రంగ పరిరక్షణ కోసం కార్పొరేట్ దోపిడికి వ్యతిరేకంగా మాట్లాగలిగిన పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పెదకోటయ్య, డివైఎఫ్ఐ నాయకులు కొమ్మల చిన్నరామయ్య, కెవిపిఎస్ నాయకులు కత్తి ఏబు, వికలాంగుల సంఘం నాయకులు రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పోతురాజు, మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు :తూర్పు రాయలసీమ శాసన మండలి ఎన్నికల్లో నిజాయతీ పరులను గెలిపించు కుందామని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బి.రఘురాం, ఎఐటియుసి జిల్లా నాయకులు దేవెండ్ల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ పట్టభద్రుల నియోజక వర్గ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ నియోజక వర్గ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు గురునాథం, బాణాల రామయ్య, సిఐటియు నాయకులు గొట్టెముక్కల రాజారామయ్య, దాసి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


మహిళ కడుపు నుంచి తొలగించిన కణితి

మూడు కిలోల కణితి తొలగింపు

ప్రజాశక్తి-మార్కాపురం

ఓ మహిళ కడుపు నొప్పి, అధిక రక్తస్రావంతో బాధపడుతూ వైద్యం కోసం స్థానిక శ్రావణి హాస్పటల్‌కు వచ్చింది. 45 సంవత్సరాలు కలిగిన ఆమెను పరీక్షించిన డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ స్కానింగ్ పరీక్షల ద్వారా ఆ మహిళ గర్భ సంచికలో కణితి ఉన్నట్లుగా గుర్తించారు. కణిత పెరుగుతున్నందనే ఆ మహిళ బాధపడుత న్నట్లుగా గుర్తించారు. ఆ మహిళ కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు శుక్రవారం శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆ మహిళ గర్భ సంచితో సహా మూడు కిలోల బరువు కలిగిన కణితిని తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకదుర్గ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య విషయంలో అజాగ్రత్తతో ఉండరాదన్నారు. గర్భంలో ఏదైనా సమస్యతో బాధ పడుతున్నప్పుడు వైద్యులను సంప్రదించాలన్నారు. ముందుగా గుర్తిస్తే శస్త్ర చికిత్సల వరకు రాకుండా జాగ్రత్త పడవచ్చునని తెలిపారు.

కళ్ల అద్దాలు పంపిణీ

కొండపి : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు మరియు ఏపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల విద్యార్థులు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి శుక్రవారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. టంగుటూరుకు రావూరి విలీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదుకు చెందిన న్యాయవాది పిసపాటి శ్రీనివాస రాజశేఖర్ సహకారంతో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పెట్లూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.అనూష, సిహెచ్ఒ యస్.కృష్ణంరాజు, కామేపల్లి పిహెచ్‌సి పిఎంఒ బి.మురళి కృష్ణారెడ్డి , టంగుటూరు ఎస్‌బిఐ అసిస్టెంట్ మేనేజర్ పి.వాసు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఓటర్లకు డబ్బులు పంచిన వారిపై చర్యలు తీసుకోవాలి

పొదిలి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దారు డి. భాగ్యలక్ష్మికి ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పొదిలి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయ ఓటర్లకు వైసిపి అభ్యర్థి తరపున కొందరు నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దారుకు వినతి పత్రం అందజేసిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, సిపిఐ మండల కార్యదర్శి వెంకటరత్నం, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

మార్కాపురం : ఈ నెల 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన బందోస్తు నిర్వహించాలని ఎస్‌పి శ్రీధరరావు పోలీస్ అధికారులకు సూచించారు. మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం పట్టణంలోని రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎం.భీమానాయక్, పట్టణ ఎస్ఐ సువర్ణ, రూరల్ ఎస్ఐ ఆర్.సుమన్ పాల్గొన్నారు.

ఎమినిటీస్ సెక్రటరీపై చర్యలకు ఆదేశం

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలోని 40వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ సచివాలయం పరిధిలో మౌళికమైన విషయాల గురించి పాత్‌హోల్ రిజిస్టర్, క్లోరినేషన్ రిజిస్టర్ నిర్వహించనందుకు గాను సంబంధిత సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ ఇంజనీర్ కె.మాల్యాద్రిని కార్పొరేషన్ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఇందిరానగర్ సచివాలయాలన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల గురించి వార్డు ఎమినిటీస్ సెక్రటరీని అడిగితెలుసుకున్నారు. డివిజన్‌లో కొన్ని మౌళిక వసతులకు సంబంధించి నిర్వహించ ాల్సిన రిజిస్టర్ ఎమినిటీస్ సెక్రటరీ వద్ద అందుబాటులో లేక పోవడంతో ఆయనపై చర్యలకు ఆదేశించారు. సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న వివిధ సర్వేలపై కూడా కమిషనర్ సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరం వసూలు కావాల్సిన ఆస్తిపన్ను, నీటి పన్నుల గురించి సమీక్షించారు. సచివాలయం పరిధిలో మొండి ఒకాయి దారులను గుర్తించి పన్ను చెల్లించనందుకు గాను వారికి రెడ్ నోటీసు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. నీటి పన్నులు వసూళ్లకు సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి తిరగాలని సూచించారు. అనంతరం ఇందిరానగర్ ప్రాంతంలో పర్యటించి ఆస్తిపన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు. కమిషనర్ వెంట స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్, నగరపాలక సంస్థ ఎసిపి కె.వెంకటేశ్వర్లు, డిఇఇ గణపతి, ఎంహెచ్ఒ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మిరియాల శ్రీను, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రారంభం

కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రారంభోత్సవంలో డాక్టర్ వెంకయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

కీర్తి మెడికల్ స్టోర్స్ టంగుటూరు బ్రాంచి దిన దినాభివృద్ధి చెందాలని ప్రజా వైద్యశాల వైద్యులు, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ఆకాంక్షించారు. స్థానిక శింగరాయకొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కీర్తి మెడికల్ స్టోర్స్ శుక్రవారం ప్రారం భించారు. గుంటూరు జననీ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ ముక్కు కవిత మెడికల్ స్టోర్‌ను ప్రారంభించారు. రమేష్ సంఘమిత్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ దీప జ్యోతి ప్రజ్వలన చేశారు. బ్రాంచిలోని పలు విభాగాలను ప్రముఖ వైద్యులు డాక్టర్ సెంథిల్ కుమార్, టంగుటూరుకు చెందిన వైద్యులు డాక్టర్ డి.వి.కస్తూరావు, డాక్టర్ మామిళ్ళపల్లి రంగనాథ్ బాబు, డాక్టర్ కంచర్ల సునీత ప్రారంభించారు. గునుపాటి పెద పెంచలరెడ్డి మొదటగా మందులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా కీర్తి మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు ఎల్. తిరుపతిరెడ్డి, ఎల్.వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టంగుటూరులో 21వ శాఖను ప్రారం భించినట్లు తెలిపారు. ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా పెద్దల మందులతో పాటు చిన్న పిల్లల మందులు, ఇతర పలు రకాల ఐటమ్స్‌ను 20 శాతం డిస్కౌంట్‌తో అందించ నున్నట్లు తెలిపారు. నాణ్యతలో ఏ మాత్రం రాజీ పడకుండా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.అశోక్ కుమార్, భూపాల్ రెడ్డి, మారెడ్డి మనోహర్ రెడ్డి, బ్రాంచి హెచ్ఆర్ కె.తులసి, వై.చంద్రశేఖర్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బబుల్ అందజేస్తున్న దాతలు

పాఠశాలకు వాటర్ బబుల్ అందజేత

కంభం రూరల్ : కంభం పట్టణంలోని నాయక్ వీధిలోనున్న ఉర్దూ పాఠశాల (ఎస్ఎస్) వేసవిని దృష్టిలో ఉంచుకొని నెంబర్-1 వాటర్ ప్లాంట్ వాటర్ కూలింగ్ బబుల్ శుక్రవారం అందజేశారు. కంభం-2 ఎంపిటిసి రఫీ చేతుల వాటర్ కూలింగ్ బబుల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నెంబర్-1 వాటర్ ప్లాంట్ నిర్వాహకులు బాబ్జి, పాఠశాల కమిటీ చైర్మన్ షేక్ ఖాసిం పిరా,హరూన్, ప్రధానోపాధ్యాయురాలు సహారా బేగం, రహమతునిసా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

హనుమంతునిపాడు : మండల పరిధిలోని హాజీపురంలో ప్రకతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సిబ్బంది మాట్లాడుతూ తొలకరి వర్షాలకు ముందుగా 9 నుంచి 30 రకాల విత్తనాలను భూమిలో చల్లి ఉంచుకుంటే వర్షం పడగానే అవి మొలక వస్తాయని తెలిపారు. 30 రకాల వేరు వ్యవస్థ భూమిలో ఉండటం వల్ల జీవన ద్రవ్యం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, ఎడిఎ వెంకటరమణ, ఎఒ గోపికృష్ణ, ఎంటి.విజయరాణి, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, విఎఎలు, రైతులుపాల్గొన్నారు.

పరమేశ్వరరావుకు నివాళి

పెద్దదోర్నాల : దోర్నాల పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు గూడూరి పరమేశ్వరరావు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళి లర్పించారు. పరమేశ్వరరావు మృతి టిడిపికి తీరని లోటని తెలిపారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, సుబ్బరత్నం, జడి లక్ష్మయ్య, షేక్ మాబు, నాగేంద్రబాబు, అంబటి వీరారెడ్డి ఉన్నారు.

రాములు నాయక్‌కు సన్మానం

యర్రగొండపాలెం : వైసిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పి. రాములు నాయక్‌ను యర్రగొండపాలెం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, వైసిపి మండల కన్వీనర్ కె. ఒబుల్‌రెడ్డి, జడ్‌టిపి చేదూరి విజయభాస్కర్, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు ఒంగోలు సుబ్బారెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా, వెంకటేశ్వర్లురెడ్డి, ఖాసిం పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

జరుగుమల్లి : మండల పరిధిలోని పాలేటిపాడులోనున్న జగనన్న కాలనీ లేఅవుట్‌లో తాగునీటి పథకానికి రూ.25 లక్షలు మంజూరైనట్లు ఎంపిడిఒ పి.రామకృష్ణ తెలిపారు. పాలేటిపాడు జగనన్న కాలనీలో లబ్ధిదారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 50 శాతం గృహ నిర్మాణాలు పూర్తయిన ప్రతి ఇంటికీ మంచి నీటి కొళాయి, విద్యుత్ మీటరు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కాలనీలో సిమెంట్ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాలనీలో 60 శాతం గృహాలు పూర్తయితే రూ.25 లక్షలతో తాగునీటి పథకం నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గ్రంధశ మాధవి, గృహ నిర్మాణ శాఖ డిఇ జయరావు, ఎఇ అవినాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్, ఎపిఎం భాగ్యలక్ష్మి, పాలేటిపాడు సర్పంచి కాకర్లమూడి యోహాను పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు : ఎస్ఐ

కొమరోలులో మాట్లాడుతున్న ఎస్ఐ సుబ్బరాజు

మార్కాపురంలో మాట్లాడుతున్న ఎస్ఐ సువర్ణ

ప్రజాశక్తి- కొమరోలు

విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కారాదని ఎస్ఐ సుబ్బరాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుబ్బరాజు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసైతే వారి జీవితం నాశనం అవుతుందని తెలిపారు. మత్తు పదార్థాల వల్లే కలిగే అనర్థాల గురించి దృశ్య రూపంలో వివరించారు. విద్యార్థులపై తమ తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. అనంతరం సత్ప్రవర్తనతో మెలుగుతూ గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ అల్లూరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **టంగుటూరు :** మాదక ద్రవ్యాల నిరోధక టంగుటూరే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థు లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణ కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. టంగుటూరు పరిసర ప్రాంతాలలో ఎవరైనా, ఎక్కడైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలు, వసతులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. టంగుటూరు మండలం పరిధిలో 2,47 మంది పట్టభద్రుల ఓటర్లు, 87 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. **మార్కాపురం :** యువత మత్తుకు బానిస కాకూడదని మార్కాపురం పట్టణ ఎస్ఐ సువర్ణ సూచించారు. స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో 'సంకల్పం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సువర్ణ మాట్లాడుతూ మత్తుకు దగ్గరైతే జీవితం అంతమేనన్నారు. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడం కష్టమే అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. వారి ఆశలు వమ్ము చేయరాదన్నారు. జీవితంలో ఉన్నతంగా రాణించేందుకు అందరూ కష్టపడాలన్నారు. సమాజ సేవలో భాగస్వాములవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.రంగయ్య, ఎఒ రంజిత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** మాదక ద్రవ్యాల వినియోగం, నిర్మూలనలో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ ఫాతిమా కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులై తమ బంగారు భవిష్యత్తును బుగ్గి పాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. చిన్న వయసులో చెడు అలవాట్లకు బానిసలైతే వారి జీవితాలు దుర్భరంగా మారుతాయని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణంలో ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యత తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థల విద్యార్థుల చేత మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం నిరోధంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ బేగ్, మహబూబ్ బాషా, మహిళా పోలీసులు పాల్గొన్నారు. **దర్శి :** విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దర్శి సిఐ రామకోటయ్య తెలిపారు. స్థానిక యూన్సీ కళాశాలలో డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనపై సంకల్పం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు మింగించాలి

జరుగుమల్లిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణ

ప్రజాశక్తి-పిసిపల్లి

ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఏడాది వయస్సు నుంచి 19 సంవత్సరాల లోపు వారి చేత నులిపుగుల నివారణ మాత్రలు మిగిలించాలని ఎంపిడిఒ డివి.రమణారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ దినోత్సవంపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వైద్యసిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి తిరిగి నులిపురుగ నివారణ మాత్రలు మింగించాలన్నారు. ఈ సమావేశంలో వైద్య, ఎంఆర్‌సి సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంలు పాల్గొన్నారు. **చీమకుర్తి :** ఈనెల 14న నులిమాత్రల నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా కోరారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని ఉపాధ్యాయులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫజులుల్లా ఆయన మాట్లాడుతూ పిల్లలలో రక్తహీనత అధికంగా ఉంటుందనీ, నులిపురుగుల నివారణతోనే అది నివారణ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ క్లినిక్ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నల్లూరి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సీతారామయ్య మండల పరిధిలోని పాఠశాలలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. **కొండపి :** ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు చేత నులిపురుగు నివారణ మాత్రలు మింగించాలని పెట్లూరు పిహెచ్‌సి వైద్యులురాలు డాక్టర్ పి.అనుషా తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.అనుషా మాట్లాడుతూ ఈనెల 14న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా చిన్నారుల చేత నులిపురుగుల నివారణ మాత్రలు మిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బ్రహ్మయ్య, ఎంఇఒ కె.సురేఖ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది , ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **జరుగుమల్లి :** ఈ నెల 14న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాల, బాలికలకు ఆల్ బెండ జోల్ మాత్రలను మింగించాలని ఎంపిడిఒ పి.రామకృష్ణ తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులకు ఆల్ బెండ్‌జోల్ మాత్రలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బత్తుల నాగేంద్ర వదన్, సిహెచ్ఒ వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజరు రమ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీలు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **శింగరాయకొండ :** ఈనెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఎంపిడిఒ షేక్ జమీ ఉల్లా అధ్యక్షతన మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 14న అన్ని పాఠశాలలో ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు మిగించాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆల్ బెండజోడు టాబ్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య కృష్ణ, ఎంఇఒ శ్రీమన్నారాయణ, అంగన్‌వాడీ సూపర్ వైజరు రిజ్వానా, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, రాఘవేంద్రరావు పాల్గొన్నారు. **పొదిలి :** ఈనెల 14న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహించాలని ఎన్‌డిడి మానిటరింగ్ కమిటీ తెలిపింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీకృష్ణ అధ్యక్షతన ఎన్‌డిడి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్ వాడీ కేంద్రాలు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

తర్లుపాడు : స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఒంగోలు మార్క్ ఫెడ్ ఒంగోలు సహకారంలో తర్లుపాడు పిఎసిఎస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఒ ఆర్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు రైతుల వద్ద నుంచి శనగలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు కుందూరు సత్యనారాయణరెడ్డి, పిఎసిఎస్ సర్వేయర్ కృష్ణ ప్రసాద్, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు వెలుగు వెంకటేశ్వర్లు, తర్లుపాడు సిఇఒ టి.చిన్నకాశయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు వసూలు చేయాలి

ప్రజాశక్తి - మార్కాపురం

స్త్రీ నిధి ద్వారా ఇచ్చిన రుణాల రికవరీ 100శాతం చేయాలని ఎజిఎం హర్షవర్ధన్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం హర్షవర్ధన్ మాట్లాడుతూ పొదుపు మహిళా సంఘాల సభ్యురాళ్లు ఓవర్ డ్యూ ఉన్న అమౌంట్‌ను ఈ నెల 15లోపు చెల్లించేలా చూడాలన్నారు. విఒలు వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. స్త్రీ నిధి తీసుకున్న సభ్యులు కూడా విధిగా ప్రతినెలా 5లోపు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఎపిఎం రమేష్‌బాబు మాట్లాడుతూ స్త్రీ నిధి ద్వారా ఇచ్చే ఋణాల నుంచి సభ్యులు గేదెలు, పొట్టేళ్లు, గొర్రెలు వంటి లైవ్ స్టాక్ యూనిట్స్ పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమములో సిసి మనోకుమారి, స్త్రీ నిధి మేనేజర్ సులోచన, ఎల్ఎస్ నాగ భూషణం,విఒఎలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి -యర్రగొండపాలెం

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ రంగసుబ్బ రాయుడు అధికారులను ఆదేశించారు. స్థానిక చైతన్య నగర్‌లో శుక్రవారం ఎంపిడిఒ పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు కాలువలను, డ్రైనేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి రామసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి, సర్పంచి రామావత్ అరుణాబాయి, వైద్య ఆరోగ్య సిబ్బంది రేణుక, సంధ్యారాణి, వీరమ్మ, స్వర్ణలత, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
శనివారం 11 మార్చి 2023

14న నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14న బాపట్ల జిల్లాలో 25 మండలాల్లో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ శుక్రవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు 1ఏడాది నుంచి 19 ఏళ్ల వయసులోపు వారందరికీ ఈ మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆల్బెండజోల్400 ఎంజి మాత్రల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఒక ఏడాది నుంచి రెండేళ్ల లోపు చిన్నారులకు 200 ఎంజి మాత్రలు మాత్రమే వేయాలన్నారు. మాత్రలను పొడిచేసి చిన్నారులకు పౌడర్ రూపంలో ఇస్తే మరీ మంచిదని అన్నారు. జిల్లాలో 477 సచివాలయాల పరిధిలో 3 లక్షల, 17 వేల 350 మాత్రలు పంపిణీ జరిగిందని అన్నారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక, ఉన్నత, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకుఈ మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ మాత్రలు సేవించడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే దగ్గరలోని పిహెచ్‌సి, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగిందని అన్నారు.

నగరం: ఈ నెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలకు ఈ టాబ్లెట్ మింగిస్తే నులిపురుగులను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రమణ, దూళిపూడి పిహెచ్‌సి డాక్టర్ షేక్ నజీలా పర్వీన్, సిహెచ్‌వో బాబూ రావు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మాట్లాడుతున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

సంతమాగులూరు: ఈ నెల 14వ తేదీన జరిగే జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా, శుక్రవారం మండల పరిషత్ సమావేశం హాల్‌లో ముందస్తుగా డివామిన్ టాబ్లెట్స్ బాక్స్‌లను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్లు ఎంపీడీవో ఎం సాంబశివరావు, మండల విద్యాశాఖాధికారి వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. ఈ టాబ్లెట్స్‌ను 0-19 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలకు అందజేయవలసి ఉంటుందని అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీ, కస్తూరిబా పాఠశాలను కలుపుకొని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా 12,300 మందికి అందజేయవలసి ఉందన్నారు. అయితే 13,000 టాబ్లెట్స్ సప్లయ్ వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిర్మల్ కుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్లికురవ రూరల్: జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న మండలంలో జరిగే నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి రమీజు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని గ్రామాలకు ఆల్బెండజోల్ మాత్రలను స్కూల్ హెచ్‌ఎం, ఏఎన్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సుమారు 6000 ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయసు వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయాలని అన్నారు. పిల్లల్లో నులిపురుగులు, రక్తహీనత నివారణకు ఈ మాత్రలు ఉపయోగపడతాయని అన్నారు. మధ్యాహ్నం భోజనం చేశాక ఒక మాత్రను వేసుకోవాలని తెలిపారు.

బల్లికురవలో అధికారుల సమావేశం

పంగులూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో రమణమూర్తి

కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి, ఈ నెల 14వ తేదీన అంగన్‌వాడీ పిల్లలు, స్కూల్ పిల్లలు అందరూ స్కూళ్లకు హాజరు కావాలని పంగులూరు ఎంపీడీవో రమణమూర్తి కోరారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా, శుక్రవారం ఎంపీడీవో, వైద్య అధికారుల అధ్యక్షతన అన్ని డిపార్ట్‌మెంట్ల వారితో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆరు నెలలకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు. ప్రతి విద్యార్థీ ఈ టాబ్లెట్లు మింగాలని వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున్‌రావు, డాక్టర్ శివ చెన్నయ్య కోరారు. ఆల్బెండజోల్ టాబ్లెట్‌ను మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత పిల్లలకు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమం మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 21 గ్రామాల్లో జరుగుతుందన్నారు. 19 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఈ టాబ్లెట్లు మింగాలని, 14వ తేదీన ఆరోగ్యం బాగా లేని పిల్లలు 18వ తారీఖున అయినా మింగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు.

సంతమాగులూరులో..

సావిత్రిబాయిపూలేకు నివాళి అర్పిస్తున్న నాయకులు

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అద్దంకి బంగళా రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రి బాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్య క్రమానికి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సేవకురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. భారతదేశంలో స్త్రీలకు పాఠశాలలు స్థాపించి విద్యను అందించిన మొట్టమొదటి వ్యక్తి అని పేర్కొన్నారు. సమాజ సేవకోసం పిల్లలను కూడా కనకుండా ఒక అనాథ బ్రాహ్మణ బిడ్డను అక్కున చేర్చుకొని అతడిని డాక్టర్‌ను చేశారన్నారు. అతడి చేత కూడా పేదలకు ఉచిత వైద్యం అందింపజేశారన్నారు. ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవచేసి చివరకు అదే వ్యాధితో మరణించిన త్యాగమూర్తి సావిత్రిబాయి అని కొనియాడారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ఆర్‌జెడి దేవపాలన, విశ్రాంత ఉపాధ్యాయులు జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, విశ్రాంత బ్యాంకు మేనేజర్ తాళ్లూరి బాబూరావు పాల్గొన్నారు. ఐక్య వేదిక సభ్యులు చెన్నుపల్లి నాగేశ్వరారావు, బుజ్జిబాబు, అంకం నాగరాజు, తెలగతోటి రాధాకృష్ణమూర్తి, యర్రమోతు శంకరరావు, పాదయాత్ర రోశయ్య, ఓంకార్, పసుమర్తి బాబు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

22న 'ములాయం' విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-చీరాల

మాట్లాడుతున్న మాజీ మంత్రి పాలేటి రామారావు

ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాది పార్టీ వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు అన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వాడరేవు బస్టాండ్ సమీపంలోనీ మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన ములాయం సింగ్ యాదవ్ విగ్రహాన్ని ఈ నెల 22వ తారీఖున ములాయం సింగ్ యాదవ్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ములాయం సింగ్ తన పరిపాలనలో ప్రజలకు అనేక సేవలను అందించారని, ఆయన పార్టీకే పరిమితం కాదని, అందరి మనిషి అని కొనియాడారు. ఆయన సేవలకు చిహ్నంగా రాజకీయ పార్టీలకు అతీతంగా చీరాల ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటుకు చేసుకునేందుకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి మరియు మున్సిపల్ అధికారులకు కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందించగా కౌన్సిల్ ఆమోదంతో విగ్రహ ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది అని అన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని అన్నారు. కావున ప్రజలందరూ ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-సంతమాగులూరు: ఈ నెల 13వ తేదీన సంతమాగులూరు ప్రభుత్వ హైస్కూల్లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఎం సాంబశివరావు తెలిపారు. మండలంలోని 1,127 మంది పట్టభద్రులు, 54 మంది ఉపాధ్యాయులు తమ ఓటును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. డబల్ ఎంట్రీలో ఉన్న పేర్లను తొలగించినట్లు తెలిపారు. సంతమాగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు, నులి పురుగుల టాబ్లెట్స్ ప్యాకెట్స్‌ను అందజేస్తున్న ఎంపీడీవో సాంబశివరావు పేర్కొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవం

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరులో వేంచేసియున్న అవధూత ఆవులమంద గురు చెన్నాదాస్ 132వ ఆరాధన మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో కిటకిటలాడింది. దీంతో గ్రామంలో తిరుణాల వాతావరణం నెలకొంది. గ్రామంలో గంధం ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి గుర్తింపు పొందిన కళాకారులచే సత్యహరిచంద్ర పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను గ్రామ చెన్న దాస్ కమిటీ నాయకులు పూర్తి చేశారు.

గోడప్రత్రులను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

ఆవిర్భావ సభకు తరలిరావాలి

ప్రజాశక్తి-బాపట్ల

మచిలీపట్నంలో ఈ నెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భవ దినోత్సవ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం బాపట్ల జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ గోడప్రతులను జనసేన నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధిక మొత్తంలో సభ్యత్వాలు నమోదు చేసిన జనసేన కార్యకర్తలను ఆమె సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి నామన వెంకట శివన్నారాయణ, చిలకల సురేంద్రబాబు, గోపాలం లక్ష్మీకళ, అరుమళ్ల సుజిత్, కారుమూరి అంజనేష్, కొత్ర మణికంఠ, గొగన ఆదిశేషు, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మహిళలు చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది బొర్రా రామకృష్ణ సూచించారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా పర్చూరు న్యాయ సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ప్రసంగించారు. గృహహింస, వరకట్న వేధింపులు తదితర అన్ని చట్టాలు ఉన్నాయన్నారు. దిశ, నిర్భయ చట్టం కొత్తగా వచ్చాయన్నారు. వెలుగు ఏపిఎం టి మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే స్త్రీనిధి, డ్వాక్రా రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచించారు. ది ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రావినూతల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. చిన్న ఆరోగ్య సమస్య ఏదైనా ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. సమావేశంలో పర్చూరు కోర్టు పక్షాన రాఘవులు, ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు టి అంజలి, ఇంకొల్లు పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి సుధాకర్, డ్వాక్రా యానిమేటర్లు, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు. శనివారం ఇంకొల్లు మండలంలోని పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయవాది మేకల రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు జరుగుతుందని నిర్వాహకులు వివరించారు.

రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డిఆర్‌ఎం

రైల్వే స్టేషన్‌ను సందర్శిస్తున్న డిఆర్‌ఎం

ప్రజాశక్తి - గిద్దలూరు

కేంద్ర ప్రభుత్వం అమత్ భారత్ స్టేషన్ పథకం కింద గిద్దలూరు రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేసినట్లు డిఆర్‌ఎం రామకష్ణ తెలిపారు. అందులో భాగంగా గిద్దలూరు రైల్వే స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఎం మాట్లా డుతూ గిద్దలూరు రైల్వేస్టేషన్ అమత్ భారత్ కింద ఎంపిక కావడం వల్ల స్టేషన్ అభివద్ధికి అవసరమైన సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. తెలిపారు. గ ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రసూల్, కమర్షియల్ సూపరిం డెంట్ లక్ష్మి నారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి

మార్కాపురం : మార్కాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు గుంటూరు రైల్వే డిఆర్‌ఎం రామకృష్ణారావు తెలిపారు. మార్కాపురం రైల్వే స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఎం మాట్లాడుతూ ప్రధాన మంత్రి అమృత్ భారత్ పథకంలో గుంటూరు పరిధిలో 16 స్టేషన్లు ఉన్నాయన్నారు. అందులో మార్కాపురం కూడా ఉందన్నారు. ఈ పథకంలో భాగంగా ఫ్లాట్‌పారం అభివృద్ధి, కోచ్ ఇండికేటర్స్ బోర్డులు, డిస్‌ప్లే బోర్డులు, వెయిటింగ్ హాలు, ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వికలాంగు కోసం షెల్టర్లు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు ఆర్‌కెజె నరసింహా వివిధ సమస్యలపై డిఆర్‌ఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ మేనేజర్ భాస్కరరెడ్డి, ఇన్‌ఛార్జి స్టేషన్ మాస్టర్ ఆచారి, ప్రయాణికుల సంఘం కార్యదర్శి ఎన్‌సి నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపిల్లో సత్తా చాటిన జార్జి విద్యార్థులు

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో జార్జి కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. పలువురు ఉద్యోగాలు సాధించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టర్నింగ్ మైండ్స్ ఈ ఎంపికలు నిర్వహించింది. ఇంజినీరింగ్ 4 సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులకు ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిత వేతనం రూ. 6.2లక్షలు ఉంటుందన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని ప్రాంగణ ఎంపికలు ఉంటాయని ఆ కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను జార్జి విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.రాజబాబు, డీన్ ఎకడమిక్స్ డాక్టర్ ఎం.మస్తానయ్య అభినందించారు.

నీటి కోసం రోడ్డెక్కిన జనం

- సికొత్తపల్లిలో నీటి కష్టాలు
- ట్రాక్టర్లు రోడ్డుకు అడ్డుగా పెట్టి ధర్నా

నీటి కోసం ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం, పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలంలోని చాపలమడుగు పంచాయితీ పరిధిలోని సి కొత్తపల్లి గ్రామంలో నీటి కష్టాలు ప్రారంభవ ంయ్యాయి. ఆ గ్రామంలోని డీప్‌బోర్లు ఒట్టిపోయాయి. దీనికి తోడు గ్రామానికి సమీపంలోని పొలాల్లోని వ్యవసాయ బోర్లలో భూగర్భ జలమట్టం పడిపోయింది. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రత్యామ్నాయం లేక సికొత్తపల్లి గ్రామ మహిళలంతా ఖాళీ బిందెలతో శుక్రవారం రాత్రి యర్రగొండపాలెం, పుల్లలచెరువు రోడ్డుపై ఆందోళనకు దిగారు. రహదారికి నాలుగు ట్రాక్టర్లను అడ్డంగా పెట్టి టైర్లు కాల్చి పంటలు వేసి చీకట్లోనే ఆందోళన చేపట్టారు. మంచినీళ్లు ఇవ్వలేని వారు తమకేమి అభివృద్ధి చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంకర్ల బిల్లులు ఇవ్వకపోవడంతో తోలకం దారులు నీటి సరఫరా నిలిపివేశారని, దీంతో నీటి కష్టాలు అధికమయ్యాయని మహిళలు వాపోయారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళల ఆందోళనతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

మురారిపల్లిలో దాహం కేకలు

యర్రగొండపాలెం : మురారిపల్లి గ్రామంలో దాహం కేకలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని డీప్ బోర్లన్నీ ఒట్టిపోయాయి. గ్రామ సర్పంచి ఏకుల జయమ్మ ముసలారెడ్డి ఇటీవల నీటి కోసం ఐదు బోర్లను వేయించారు. వాటిలో కూడా చుక్కనీరు పడలేదు. గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు ఆరు ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజూ 30 ట్రిప్పుల నీరు సరఫరా చేస్తున్నారు. నాలుగేళ్ల నుంచి ట్యాంకర్లకు బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయక పోవడంతో యజమానులకు భారంగా మారింది. గత్యంతరం లేక వారం క్రితం ట్యాంకర్లతో నీళ్లు తోలడం ఆపేశారు. దీంతో ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో డీప్‌బోర్లు ఒట్టిపోవడం, చుట్టు పక్కల పొలాల్లోని వ్యవసాయ బోర్లలో సైతం నీటి మట్టం పడిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నాలుగేదు ఇళ్ల వారు కలిసి ట్యాంకర్‌కు రూ. వెయ్యి ఇచ్చి దూర ప్రాంతం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. పశు సంపద ఎక్కువగా ఉండడంతో ఆ నీళ్లు ఒక్కరోజు కూడా సరిపోవడం లేదు. దీంతో గ్రామంలోని మహిళలంతా ఏకమయ్యారు. నీటి కోసం రోడ్డెక్కారు. నీటి సమస్యను పరిష్కరించే వరకు తాము ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ ఖాళీ బిందెలతో రాత్రి సమ యంలో ధర్నా నిర్వహించారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని ఆందోళన చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వచ్చి పోయే వాహనాలు నిలిచిపోయాయి. చీకటిగా ఉండడంతో టైర్లు కాల్చి మంటలు వేసి ధర్నా చేశారు. ఇంత జరుగుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో మహిళలు శాపనార్థాలు పెట్టుకుంటూ ఇంటి బాట పట్టారు.

సికొత్తపల్లిలో టైర్లు కాల్చి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మురారిపల్లిలో నీటికోసం రోడ్డుపైకి వచ్చిన మహిళలు

బోగస్ ఓట్ల నమోదుపై ఎన్నికల సంఘం సీరియస్

- విచారణకు కదిలిన అధికారులు
- పదిమందికే సర్వీసు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ప్రిన్సిపల్ వాంగ్మూలం

ప్రజాశక్తి -శింగరాయకొండ

టీచర్ల బోగస్ ఓట్ల నమోదును ఎన్నికల సంఘం తీవ్రంగా పరిణించింది. వెంటనే విచారించి నివేదిక పంపాలని ఆదేశించడంతో అధికార యంత్రాంగం కదిలింది. శింగరాయకొండలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అధికార పార్టీ అనుబంధ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకునికి చెందిన విద్యాసంస్థలో టీచర్ల బోగస్ ఓట్ల నమోదుపై పత్రికల్లో వచ్చిన కథనాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గత రెండు రోజులుగా తహశీల్దారు ఉష, ఎంపిడిఒ షేక్ జిల్లా, ఎంఇఒ శివన్నారాయణ, ఇతర అధికార యంత్రాంగం విచారణ చేపట్టారు. శుక్రవారం నిర్వహించిన విచారణలో విస్తుబోయే అంశాలు వెల్లడయ్యాయి. కేవలం పదిమంది అధ్యాపకులకు మాత్రమే తాము సర్వీసు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ అమ్మనబ్రోలు వెంకటరాజారావు రాతపూర్వకంగా అధికారులకు వాంగ్మూలం అందజేశారు.

పదిమందికే సర్వీసు సర్టిఫికెట్లు : ప్రిన్సిపల్

తమకళాశాలలో పదిమందికి మాత్రమే టీచర్ ఓటు హక్కుకు అర్హత ఉందని తహశీల్దారు ఉష, మండల విద్యాధికారి శివన్నారాయణ ముందు ప్రిన్సిపల్ రాత పూర్వకంగా వాంగ్మూలం ఇచ్చాడు. తాను ఆ పదిమందికి సర్వీసు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. బోగస్ ఓట్ల చేర్పించటంలో తనప్రమేయమేమీ లేదని పేర్కొన్నారు.

25 మంది ఓటర్లు అనర్హులే ..

విచారణ చేపట్టిన అధికారులు 25 మందిని బోగస్ ఓటర్లుగా ప్రకటించాల్సి ఉంది. అయితే దీనిపై అధికారులెవరూ నోరు మెదిపేందుకు సాహసం చేయకపోవడం గమనార్హం. ఈ 25 మందికి సర్వీసు సర్టిఫికెట్లు ఎవరిచ్చారు. ప్రిన్సిపల్ సంతకంతో పాటు కౌంటర్ సంతకం చేయాల్సిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిందెవరు?. అసలు వీరందరికీ డిగ్రీ తోపాటు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి అయ్యిందా లేదా. వీరంతా ఎక్కడ నివాసం ఉంటున్నారు. బూత్ లెవల్ స్థాయిలో విచారణ జరిపారా? లేదా ?బోగస్ సర్టిఫికెట్లు సష్టించడం వెనుక ఎవరున్నారు అనేకోణంలో లోతుగా విస్తారిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.



.	Name of The Elector	Name of Father/ Mother/ Husband	Address (Place of Ordinary Residence)	School / College where Teaching	DOB/Age as on Qualifying Date	Male/ Female /Third gender	EPIC Number (if any)	Photo of the Elector
8	SHAFIYASHAIK	KALESHAPATHAN	1-127, K AGRAHARAM GRAMAM, KOLAPADU 1-127, కె అగ్రహారం గ్రామం, కొలపాడు	SRI SAI HIGH SCHOOL	[illegible]	F		Photo of the Elector is Available
9	CHINNABAIMADDIRALA	MALAKONDAIAHMADDIRALA MALAKONDAIAH	4-56, PONNALURU, PONNALURU	VIVEKANANDA B.ED COLLEGE	05/08/1978	M		Photo of the Elector is Available
0	ABRAHAMK	YERUKULAIAHK	00, AGRAHARAM, KALLURIVARIPALEM	SRI SAI HIGH SCHOOL	04/07/1981	M		Photo of the Elector is Available
1	VENKATESWARLUD	MALAKONDAIAHD	6-58, RAVULAKOLLU, RAVULAKOLLU	[illegible]ETHA COLLEGE OF [illegible]DUCATION	01/07/1979	M		Photo of the Elector is Available

బోగస్ ఓట్లు

పొన్నలూరులో బోగస్ ఓట్లు

పొన్నలూరు మండలంలో బోగస్ ఓట్ల విషయం వెలుగు చూసింది. పొన్నలూరు మండలలం కె. అగ్రహారంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు టీచర్ ఓటు కల్పించారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం ఉలవపాడులో ప్రైవేటు హైస్కూల్‌లోనూ వారి పేరుతో ఓటు నమోదు చేశారు. ఈ ఓటర్లకు సంబంధించి సర్వీస్ సర్టిఫికెట్లు జిల్లా విద్యాధికారి ధవీకరించాల్సి ఉంది. ఓటర్ల ప్రమేయం లేకుండా దరఖాస్తు ఎవరు పూర్తి చేశారు. దీని వెనుక ఎవరి హస్తం ఉందో నిర్ధారణ చేయాల్సిఉంది.

విచారణ జరుపుతున్న తహశీల్దారు

ప్రిన్సిపల్‌ను విచారిస్తున్న ఎంఇఒ